క్లుప్తంగా

నేడు విజయదుర్గమ్మకు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసియున్న మరకత లింగేశ్వర సహిత శ్రీచక్ర సమన్విత విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు పౌర్ణమి తిథిని పురస్కరించుకుని మేళతాళాల నడుమ అమ్మవారికి పల్లకీసేవ ఉంటుందని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత వెంకటకృష్ణమూర్తికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన కుదరవల్లి వెంకటకృష్ణమూర్తి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

అవార్డుతో బాధ్యత పెరిగింది



జిల్లా అధికారులతో అవార్డు అందుకుంటున్న ల్యాబ్ టెక్నీషియన్ సెరా (ఫైల్)

బుట్టాయగూడెం: అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని ల్యాబ్ టెక్నీషియన్ బొల్లపో సెరా తెలిపారు. పెనుగొండ ప్రభుత్వాస్పత్రిలో తాను అందించిన సేవలకుగాను ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ జి.సుమిత్ కుమార్, డాక్టర్ భాను నాయక్‌ల చేతుల మీదుగా సత్కారం పొందినట్లు చెప్పారు. పెనుగొండ నుంచి బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి మూడేళ్లక్రితం బదిలీపై వచ్చిన తాను రోజుకు కనీసం 4 వేలకు పైగా అన్నిరకాల టెస్ట్‌లు చేస్తున్నానని తెలిపారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలుగకుండా టెస్ట్‌లు చేసి వైద్యులకు రిఫర్ చేస్తున్నట్లు చెప్పారు. తాను అందుకున్న అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని, ప్రజలకు అందుబాటులోనే ఉంటూ మరింత సేవలు అందిస్తానని చెప్పారు.

జాబ్‌మేళాలో 25 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించి తద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వైటీసీలో గురువారం ఏజెన్సీ ప్రాంతంలోని 5 మండలాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. తిరుపతి శ్రీసిటీలోని మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ డాట్ లిమిటెడ్ (ఫార్మర్లీ కాడ్బరీ ఇండియా లిమిటెడ్), అపోలో టైర్స్ వారి ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు పీవో చెప్పారు. ఈ జాబ్‌మేళాలో 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ ఎం.నాగేశ్వరరావు, పీఎంఆర్‌సీ ఏఎంఓ శిరమయ్య, కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్




బడి బయట పిల్లలను ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎంకి అప్పగిస్తున్న ఎంఈఓ

ద్వారకాతిరుమల: బడి బయట పిల్లలను గుర్తించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ పరసా వెంకట్రావు గురువారం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. శ్రీవారి కొండ ప్రాంతంలో బడి బయట తిరుగుతున్న పలువురు పిల్లలను గుర్తించి, పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.తులసి వరలక్ష్మి, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రాంబాబు, సీఆర్పీ అశోక్ కుమార్ తదితరులున్నారు.

ఖరీఫ్ పనులు ప్రారంభం



చింతలపూడి ప్రాంతంలో ఖరీఫ్ దుక్కులు దున్నుకుంటున్న రైతులు



మెట్ట ప్రాంతంలో వ్యవసాయ బోర్ల కింద ఆరోగ్యంగా ఎదిగిన వరి నారుమడి

- సాగుకు సిద్ధమవుతున్న మెట్ట రైతులు
- సబ్ డివిజన్‌లో 15,793 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సన్న, చిన్నకారు రైతులు పెట్టుబడులకోసం ఎదురు చూస్తున్నారు. గత 4, 5 రోజులుగా వాతావరణం చల్లబడి తొలకరి వర్షాలు పడే సూచనలు కనిపిస్తుండటంతో మెట్ట రైతులు ఖరీఫ్ వ్యవసాయానికి సిద్ధమవుతున్నారు. చింతలపూడి సబ్ డివిజన్ పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నరసాపురం మండలాల్లో వరి పంటను సాగు చేసుకోవడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ బోర్ల కింద కొన్నిచోట్ల నారుమళ్లు పోసుకున్నారు. మరికొన్నిచోట్ల నారుమళ్లు పోయడానికి రైతులు విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలో 15,793 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లు, టి నరసాపురం మండలంలో 2,661 హెక్టార్లలో సాగు చేస్తారు. ఇవికాక 307 ఎకరాల్లో మొక్కజొన్న, 585 ఎకరాల్లో వేరుశనగ, 1,125 ఎకరాల్లో పొగాకు పంటలు పండిస్తారు.

విత్తనాలకు కొరత లేదు



సబ్ డివిజన్ పరిధిలో విత్తనాల కొరత లేదు. రైతులు భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి సూక్ష్మ పోషక లోపాలను అధిగమిస్తూ ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. వ్యవసాయశాఖ ద్వారా రైతుల కోసం వరి విత్తనాలను సిద్ధంగా ఉంచాం. అంతేకాక జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు రాయితీపై రైతులకు అందించాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని రకాల సహకారాలు అందిస్తున్నాం.

– బి నాగకుమార్, ఏడీఏ, వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



27వ వార్డులోని పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ను అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 27వ వార్డులోని ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్‌కుమార్ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను అందజేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ దినోత్సవం



రిటైర్డ్ వీఆర్వో సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ జయలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవ ఆవిర్భావం, దానిని నిర్వహించాల్సిన ఆవశ్యకత గురించి రెవెన్యూ సిబ్బందికి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అయిన వేదాంతపురం వీఆర్వో గేలం సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, ఆర్‌ఐ మణి దివ్య, వీఆర్వో అసోసియేషన్ నాయకులు అడపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో 4,420 ఎకరాల్లో వరిసాగుకు ప్రణాళికలు

బుట్టాయగూడెం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో బుట్టాయగూడెం మండల వ్యాప్తంగా వరి పంటను సుమారు 4420 ఎకరాల్లో సాగు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. మండలంలోని జైనవారిగూడెం, రెడ్డిగణపవరం, ఇప్పలపాడు, తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్డిగణపవరం సమీపంలో ఉన్న వరి నారుమడులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరిసాగుపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. ముందుగా ఒక ఎకరానికి సరిపడా నారుమడి 5 సెంట్లు వేసుకోవాలన్నారు. అలాగే మట్టిగడ్డలు లేకుండా బాగా దున్ని దమ్ము చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎకరానికి సుమారు 25–30 కిలోల వరి విత్తనాలు అవసరమవుతాయని చెప్పారు. అలాగే నారుమడి పోసే ముందు తప్పనిసరిగా వరి విత్తనం శుద్ధి చేసుకోవాలన్నారు. నారుమడిని 10–15 రోజులకు ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలని సూచించారు. నీరు పెట్టడానికి, తియ్యడానికి వీలుగా కాల్వలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 5 సెంట్ల నారుమడికి నత్రజని 2 కిలోలు, ఒక కిలో భాస్వరం, 1 కిలో పొటాషియం ఇచ్చే ఎరువులను దుక్కుల్లో వేయడం మంచిదన్నారు. నారుపూర్తిగా పురివిచ్చుకునే వరకూ ఆరు తడులను ఇచ్చిన తర్వాతే పలుచగా నీరు పెట్టాలన్నారు. అదేవిధంగా జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రవణాన్ని పిచికారీ చేయాలన్నారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్, గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలని చెప్పారు. ఇటువంటి పద్ధతులను పాటిస్తే ఆరోగ్యవంతమైన నారుమడులను పెంచడం సాధ్యపడుతుందన్నారు.



రెడ్డిగణపవరంలో వరి నారుమడులు పరిశీలిస్తున్న ఏఓ ముత్యాలరావు

లబ్ధిదారుల గుర్తింపు శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



విద్యావనరుల కేంద్రం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రభుత్వ పాఠశాలలో చదివే 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ బాల బాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం లబ్ధిదారుల గుర్తింపు శిబిరం పోస్టర్‌ను ఎంఈఓ పరసా వెంకట్రావు గురువారం ఆవిష్కరించారు. స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సమగ్ర శిక్ష సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ వి.చంద్రశేఖర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు, ఐఆర్‌టీలు ఎస్.దయామని, కె.భువనేశ్వరి, మెసెంజర్ పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవలో యోగా ధ్యాన మిత్రమండలి





కొయ్యలగూడెంలో యోగా ధ్యాన మిత్రమండలి ద్వారా శిక్షణ ఇస్తున్న దృశ్యం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

కొయ్యలగూడెం: యోగ, ధ్యానం ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం. అటువంటి యోగ, ధ్యానం సుమారు 25 ఏళ్లుగా కొయ్యలగూడెంలో నిర్వహిస్తూ యోగా, ధ్యాన మిత్ర మండలి ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి ఆదర్శంగా నిలిచింది. 1990 దశకంలో ఈ ప్రాంతంలో యోగాకి ఆదిగురుదేవులుగా పేర్కొనబడే (ప్రస్తుతం శ్రీశైలం నల్లమల అరణ్యంలో వనప్రస్థం గడుపుతున్న) తపోధన సిద్ధగిరి మహారాజ్ తొట్టతొలిసారిగా కొయ్యలగూడెంలో ధ్యాన, యోగ విశిష్టతను ప్రచారం చేస్తూ అతి కొద్ది మంది శిష్య పరివారానికి శిక్షణ నివ్వడం జరిగింది. ఆయన తర్ఫీదులో శిక్షణ పొందిన వారిలో ఒకరైన ప్రస్తుత గురువు చవ్వా సూరిబాబు ఆధ్వర్యంలో 1998లో యోగా ధ్యాన మిత్ర మండలి ప్రారంభమైంది. అప్పటినుంచి ఔత్సాహిక సభ్యుల చేత కొయ్యలగూడెంలోని పలు ప్రైవేటు కళాశాలల ప్రాంగణాలు, హిందూ ధార్మిక భవనం, ఇలా కొన్ని ప్రాంతాల్లో సామూహిక శిక్షణ ఇస్తూ మిత్ర మండలి మెట్ట ప్రాంతంలో ప్రాచుర్యం పొందింది. గత దశాబ్దం నుంచి ధ్యానంపై ప్రజల్లో విశేషమైన అవగాహన కలగడంతో ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు ఇలా నేటి ప్రపంచంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆయావర్గాల వారు శిక్షణ పొందుతూ జీవనం గడుపుతున్నారు. యోగ ధ్యాన మండలికి ప్రభుత్వం పక్కా భవనాన్ని నిర్మించాలని తద్వారా మరింతగా యోగా ధ్యానం ప్రాచుర్యం పొందడానికి వీలవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరంపై జంగారెడ్డిగూడెం పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. మండలంలోని అక్కంపేట గ్రామ శివారులో దాడులు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి రూ.7,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ ఎస్.ఉమ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 17వ తేదీన శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తగరం నాగరాజు అతని ఇంటి వద్ద ఉన్న సమయంలో పాలకుంట మహేష్, మరో ఇద్దరు కలిసి దాడి చేశారన్నారు. దీంతో గాయపడిన నాగరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

చుట్టల కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): చుట్టల కార్మికులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ చుట్టల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక చొడిదిబ్బ పెద్దరామాలయం వీధిలో ఉన్న కమ్యూనిటీ హాలులో జనరల్ బాడీ సమావేశం వి.చంటి అధ్యక్షతన నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నగర నాయకులు గడశాల రాంబాబు, మంగం అప్పారావు మాట్లాడారు. నగరంలో వందలాదిగా పనిచేస్తున్న చుట్టల కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రెండేళ్లకోసారి జరిగే వేతన ఒప్పందం విషయంలో టుబాకో మర్చంట్స్ మ్యానిఫ్రాక్చర్స్ అసోసియేషన్ చొరవ తీసుకుని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేయాలన్నారు. కూలీ రేట్లు పెంపుదల కోరుతూ ఈ నెల 25న యజమానులకు వినతిపత్రం అందజేయాలని జనరల్ బాడీ తీర్మానించింది.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



జంగారెడ్డిగూడెం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కిషోర్‌కుమార్

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదీన జంగారెడ్డిగూడెం కోర్టు నందు నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సీహెచ్ కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, ప్రీ లిటిగేషన్ (బ్యాంకు, బీఎస్ఎన్ఎల్) కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఈ కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించి ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు. అంతేకాకుండా సుప్రీంకోర్టులో పెండింగ్ ఉన్న కేసుల పరిష్కారానికి జూలై 27 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు. వర్చువల్ విధానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రహదారిని అభివృద్ధి చేయాలని వినతి

టి.నరసాపురం: చింతలపూడి – టి.నరసాపురం ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా గురువారం ఒక ప్రకటనలో కోరారు. విద్య, వైద్యం తదితర ఏ పనులకైనా టి.నరసాపురం మండల ప్రజలు, విద్యార్థులు సమీపంలోని చింతలపూడి వెళ్లాల్సి ఉందని, అయితే చింతలపూడి వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వాన్నంగా ఉండటంతో ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారని పేర్కొన్నారు. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతుండడంపై వాహనచోదకులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుండటంతో టిప్పర్ల రద్దీతో రోడ్డు మరింత దారుణంగా తయారైందని.. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి టి.నరసాపురం నుంచి చింతలపూడి ప్రధాన రహదారికి మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలని కోరారు.



అధ్వానంగా ఉన్న టి.నరసాపురం - చింతలపూడి ప్రధాన రహదారి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కే విఘ్నేష్ ఆధ్వర్యంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రేడ్–2 మున్సిపాలిటీ జనాభాకు తగ్గట్టు మున్సిపల్ పారిశుధ్య, పంపు ఆపరేటర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ఆప్కాస్‌లో విధులు నిర్వర్తిస్తున్న పబ్లిక్ హెల్త్, నాన్ పబ్లిక్ హెల్త్ కార్మికులలో టెక్నికల్ కోర్సులు పూర్తిచేసిన వారిని స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించి తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్లకు మౌలిక సదుపాయాలైన యూనిఫామ్స్, చెప్పులు, కొబ్బరినూనె, గ్లౌస్, మాసుకులు, రెయిన్ కోట్‌లు, బూట్లు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు టూల్ కిట్లు, వాల్ బిట్లు, టార్చిలైట్లు, రెయిన్ కోట్లు, గ్లౌజులు, బూట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జేవీ రమణ రాజు, పట్టణ పారిశుధ్య విభాగ అధ్యక్షుడు కొత్తూరి నాగేశ్వరరావు, కార్యదర్శి బొక్కా శ్రీను, ఇంజినీరింగ్ విభాగ పట్టణ అధ్యక్షుడు కంతేటి వెంకట్రావు, కార్యదర్శి ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిర్ధారణ శిబిరాలను వినియోగించుకోండి

దచింతలపూడి: దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు అధికారి బి సోమశేఖర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గురువారం జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు కలిగిన 6 నుంచి 18 సంవత్సరాలు నిండిన బాల, బాలికలు, వారి తల్లి,దండ్రులు శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి సోమశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు అందరూ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందించే ఉపకరణాలను వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి 136 మంది బాల, బాలికలను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ బి భాస్కరరావు, హెచ్‌ఎం మురళీకృష్ణ, నాలుగు మండలాల విద్యాశాఖాధికారులు, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.



ఉపకరణాల పంపిణీ కోసం లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న దృశ్యం

రైతులకు విత్తనాల పంపిణీ



ప్రగడవరం ఆర్‌బీకేలో ఎంటీయూ 1061 ఫౌండేషన్ సీడ్‌ను రైతులకు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మండల వ్యవసాయాధికారిణి మీనాకుమారి తెలిపారు. ప్రగడవరం రైతు భరోసా కేంద్రంలో గురువారం గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా రైతులకు రాయితీపై ఎంటీయూ 1061 ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మీనాకుమారి మాట్లాడుతూ రైతులు విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మొలకశాతం పరీక్షించుకోవాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ టి భూపతి, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, ఎంపీఈఓలు, ఎంఏఓలు, రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేయడమే లక్ష్యం



గుంటుపల్లి అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

కామవరపుకోట: చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. గుంటుపల్లి గ్రామంలో గురువారం టీడీపీ మండల కన్వీనర్ కిలారు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. మెట్టప్రాంత వరదాయిని అయిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న రోజుల్లో త్వరితగతిన పూర్తి చేయడమే తన లక్ష్యం అని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. అన్ని శాఖల నుంచి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి కృషి చేస్తానన్నారు. 100 రోజుల పాలనపై ప్రణాళికను సిద్ధం చేసి రోడ్లు పూర్తి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతిన వెంకట్రావు, ఎంపీటీసీ కంఠమనేని అంజిమూర్తి, పుష్పరాజ్యం, సర్పంచ్ గోరింక దాసు, ఎరగ్రాలువ ఎత్తిపోతల సంఘం చైర్మన్ కంఠమనేని సత్యనారాయణ, రేగుంట సురేష్, నూతి లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ వర్మ, జుజ్జూరి బాబ్జి, డోలా విజయ్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.